పర్వతారోహణ విద్యార్థికి సన్మానం

వీరాజ్‌ను అభినందిస్తున్న చైర్మన్ ఉప్పలయ్య, కమిషనర్ మారుతీ ప్రసాద్

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 16 : మూడురోజుల్లో 4,258 మీటర్ల పర్వతారోహణ చేసి, రికార్డు సృష్టించిన తౌటం వీరాజ్‌ను బుధవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, కమిషనర్ మారుతీ ప్రసాద్, ఏఈ మసూద్ అలీ, పలువురు కౌన్సిలర్లు, నాయకులు ఘనంగా సన్మానించారు. మంచిర్యాల పట్టణంలోని జాఫర్ నగర్‌కు చెందిన తౌటం శ్యాంసుందర్, స్వర్ణలత దంపతుల కొడుకు వీరాజ్ కరీంనగర్‌లోని శ్రీచైతన్య స్పోర్ట్ అకాడమీలో 9వ తరగతి చదువుతున్నాడు. ఇందులో కోచింగ్ తీసుకుంటున్న 40 మంది విద్యార్థులు పర్వతారోహణకు వెళ్లగా, వీరాజ్ మూడురోజుల్లో అధిరోహించాడు. ఈ సందర్భంగా వీరాజ్‌ను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

బాధితులకు దివాకర్‌రావు పరామర్శ

లక్షెట్టిపేట, అక్టోబర్ 16 : లక్షెట్టిపేట పట్టణానికి చెందిన వ్యాపారి రుద్ర రవికుమార్(52) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు బుధవారం ఆయన నివాసంలో కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే పట్టణంలోని గోదావరి రోడ్డుకు చెందిన దుసముడి చిన్నరాజన్న(69) రెండు రోజుల క్రితం అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, పాదం శ్రీనివాస్, చాంద్ పాషా, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, అక్టోబర్ 16 : శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రముఖ బట్టల వ్యాపారి, ఆయ్యప్ప గురుస్వామి వంగ శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి, నస్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ సంపెల్లి ప్రభాకర్ పరామర్శించారు. సోదరులు వంగ రాజుకుమార్, వంగ శివకుమార్ తల్లి వెంకటమ్మను ఓదార్చారు. బీఆర్ఎస్ 17వ వార్డు ఇన్‌చార్జి ఎండీ రఫీక్‌ఖాన్, బీఆర్ఎస్‌వై జిల్లా కార్యదర్శి భరత్‌రెడ్డి, సంకెనపల్లి రాజేందర్, గునిగంటి అశోక్ పాల్గొన్నారు.

సీఐల బదిలీలు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 16 : మంచిర్యాలలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ బుధవారం ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మల్టీ జోన్ హైదరాబాద్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఐటీ సెల్ రామగుండంలో విధులు నిర్వహిస్తున్న ఎస్ ప్రమోద్ ఎస్‌హెచ్‌వో మంచిర్యాల (టౌన్) పీఎస్ ఆఫ్ రామగుండం కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. ఎస్‌హెచ్‌వో మంచిర్యాల (టౌన్) పీఎస్ సీఐ ఆర్ బన్సీలాల్ అటాచ్డ్ ఐజీపీ మల్టీజోన్-1 హైదరాబాద్‌కు.., డా. వేణు చందర్ సీసీఎస్ రాజన్న సిరిసిల్ల నుంచి శ్రీరాంపూర్ సర్కిల్ ఆఫ్ రామగుండం కమిషనరేట్‌కు.., శ్రీరాంపూర్‌లో విధులు నిర్వహిస్తున్న దెబ్బట మోహన్ అటాచ్డ్ ఐజీపీ ఎంజడ్-1 హైదరాబాద్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో వెల్లడించారు.

ఎరువుల విక్రయాలపై అవగాహన

హాజీపూర్, అక్టోబర్ 16 : మండలంలోని గుడిపేట రైతు వేదికలో రైతులు, ఫర్టిలైజర్ దుకాణ యజమానులకు బుధవారం ఎరువుల విక్రయాలపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కల్పన అవగాహన కల్పించారు. మంచిర్యాల డివిజన్ పరిధిలోని రైతులకు ఎరువుల బస్తాల విక్రయాలను ఆధార్, బయోమెట్రిక్ ద్వారా నిర్వహించనున్నారు. ఈ విధానం 2017 నుంచే కొనసాగుతున్నదని, దానిని మరింత అప్‌గ్రేడ్ చేసేందుకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఎంఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో రైతుల వివరాలు ఎలా నమోదు చేయాలనే విషయంపై తమిళనాడుకు చెందిన ఫ్యాక్ట్ ఫర్టిలైజర్ కంపెనీ ప్రతినిధులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హాజీపూర్ మండల వ్యవసాయ అధికారి కృష్ణతో పాటు, లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారంకు చెందిన వ్యవసాయ అధికారులు మహేందర్, అంజిత్, శ్రీకాంత్, రైతులు, ఫెర్టిలైజర్ దుకాణాదారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బెల్లంపల్లి, అక్టోబర్ 16 : మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రూ.11 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత తెలిపారు. పట్టణంలోని 11వ వార్డులో రూ.5లక్షలతో సీసీ రోడ్డు, 10, 28 వార్డుల్లో రూ.3లక్షలతో మురుగు కాలువ, 20వ వార్డులో రూ.3 లక్షలతో సీసీ రోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఏఈ సందీప్, టీవో ఆశ్రిత్, కౌన్సిలర్లు గోసిక రమేశ్, కీంశెట్టి సరిత, నాయకులు నెల్లి రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన

హాజీపూర్, అక్టోబర్ 54 : సెంటర్‌ఫర్ రూరల్ మేనేజ్‌మెంట్ నేషనల్ లెవల్ మానిటరింగ్ సభ్యులు సీపీ బాలమురళి, కేహెచ్ సునిల్ బుధవారం హాజీపూర్ మండలం వేంపల్లిలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధుల ద్వార నడుస్తున్న పనుల అమలు విదానంపై తనిఖీ చేశారు. ఉపాధి హామీ ద్వారా కొనసాగుతున్న పనులు, పింఛన్లు, మహిళా సంఘాలు చేపట్టిన పనులు, గ్రామంలో నిర్మించిన రోడ్లు, పంచాయతీ సిబ్బంది నిర్వహిస్తున్న పనులు, కార్యాలయ రికార్డ్సును పరిశీలించారు. అనంతరం ఉపాధి కూలీలు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో మాట్లాడారు. వీరి వెంట జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, నోడల్ అధికారి సదానందం, మండలాభివృద్ధి అధికారి ప్రసాద్, మండల పంచాయతీ అధికారి ఉమర్ శరీఫ్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఏపీఎం రాజన్న, పంచాయతీ కార్యదర్శి ప్రతిభ, ఈసీ శ్రీనివాస్, టీఏ వేణు, ఎఫ్ఏ స్వర్ణ తదితరులున్నారు.

జైపూర్, అక్టోబర్ 16 : టేకుమట్లలో కేంద్ర కమిటీ బృందం సభ్యులు పర్యటించారు. పంచాయతీరాజ్ అధికారులు స్వాగతం పలికారు. గ్రామపంచాయతీల రికార్డుల నిర్వహణ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల అమలు తీరును పరిశీలించారు. ఉపాధి హామీ ద్వారా చేపట్టిన పనులు, జీపీడీపీ ప్రణాళిక తయారీ విధానం, అనంతరం క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో బాపు, ఏపీడీ సదానందం, ఏపీఎం రాజ్‌కుమార్, ఏపీవో వెంకటేశ్వర్లు, ఈజీఎస్ ఈసీ రాజమౌళి, కార్యదర్శి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, అక్టోబర్ 16 : మండలంలోని జామిని, రాసిమెట్ట గ్రామాల్లో జాతీయ లీగల్ మానిటరింగ్ బృందం సభ్యుడు నాగరాజు తనిఖీ చేశారు. జిల్లా పర్యవేక్షణ అధికారి మల్లేశ్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఎంపీవో మోహన, ఐకేపీ ఏపీఎం సుజాత, ఉపాధి హామీ ఈసీ అంకుష్, ఉపాధి హామీ మండల ఏపీవో నగేశ్, టీఏలు, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల రిపోర్టు

నస్పూర్/తాండూర్/హాజీపూర్/సిర్పూర్(టీ), అక్టోబర్ 16 : డీఎస్సీ 2024లో ఎంపికైన సెకండరీ గ్రేడ్ టీచర్లు బుధవారం రిపోర్టు చేశారు. మంచిర్యాల మండలానికి సంబంధించి 8 మంది ఉపాధ్యాయులు విద్యాధికారి మాలవిదేవికి రిపోర్టు చేశారు. తాండూర్ మండలానికి చెందిన ఉపాధ్యాయులు ఎమ్మార్సీ కార్యాలయంలో రిపోర్టు చేయ గా పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మాసా డి శ్రీరాములు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నర్ర తిరుపతి, ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. హాజీపూర్ మండలానికి చెందిన ఇద్దరు ఎస్ఏ మ్యాథ్స్ జీ మోహన్ (పడ్తన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాల), తెలుగు పండిత్ పుల్లా అన్వేశ్‌గౌడ్ (ర్యాలీ ప్రాథమికోన్నత పాఠశాల)కు కేటాయించారు. సిర్పూర్(టీ) మండలంలో సిర్పూర్(టీ) కాంప్లెక్స్ పరిధిలో 20 మంది, లోనవెల్లి కాంప్లెక్స్ పరిధిలో ముగ్గురు, వేంపల్లి కాంప్లెక్స్ పరిధిలో ఏడుగురు విధుల్లో చేరినట్లు ఎంఈవో వేణుగోపాలరావు తెలిపారు.

వింత వ్యాధితో ఎడ్లు మృతి

కోటపల్లి, అక్టోబర్ 16 : మండలంలోని లింగన్నపేటలో పశువులు వింత వ్యాధితో మృతిచెందుతున్నట్లు రైతులు వాపోతున్నారు. రెండు రోజుల వ్యవధిలో బొరగల్ల సమ్మయ్య, బొరగళ్ల రమేశ్‌కు చెందిన ఎడ్లు చనిపోయాయని వివరించారు. అయినా సంబంధిత అధికారులు స్పందించడంలేదని, పశువైద్యాధికారులకు ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పటిష్ట చర్యలు

- **రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)**



ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న మంత్రి సీతక్క

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 16 : రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. కుమ్రం ఆసిఫాబాద్ జిల్లాలో ఆమె బుధవారం పర్యటించారు. ఆసిఫాబాద్ మండలంలో గుండి గ్రామంలో పదో తరగతి వరకు ఉన్నతీకరించిన పాఠశాలను ప్రారంభించారు. పెద్దవాగుపై వంతెన, రోడ్డును సాధ్యమైనంత త్వరగా నిర్మిస్తామని తెలిపారు. కనరగాం రహదారి కూడా పూర్తి చేస్తామన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్ అడుగగా మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం తిరిగి వచ్చేటప్పుడు వాగులో నడుచుకుంటూ వచ్చారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో బీహెచ్ఈఎల్ సంస్థ సౌజన్యంతో సంచార సైన్స్ ల్యాబ్ బస్సును మంత్రి ప్రారంభించారు. జిల్లాకు రెగ్యులర్ డీఈవోను నియమించాలని, అల్పాహార పథకాన్ని పారంభించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి మంత్రి దృష్టికి తీసుకురాగా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టరేట్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ, పేదరిక నిర్మూలన సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. 270 మహిళా సంఘాలకు రూ.16 కోట్ల బ్యాంకు చెక్కును, రూ.2 కోట్లు స్త్రీ నిధి రుణం చెక్కును మహిళా సంఘాలకు అందించారు. పీవీటీజీ గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవల కోసం ప్రధానమంత్రి జన్ మన్ ధన్ పథకం కింద మొబైల్ వాహనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, నాయకులు మల్లేశ్, రవీందర్, చరణ్ దాస్, డీఎంహెచ్‌వో తుకారాం, డీఆర్డీవో దత్తారాం, అధికారులు, పాల్గొన్నారు.

వట్టివాగు రిజర్వాయర్ కట్ట నిర్మాణానికి శంకుస్థాపన..

రెబ్బెన, అక్టోబర్ 16 : వట్టివాగు రిజర్వాయర్ రక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. బెల్లంపల్లి ఏరియా ఖైర్‌గూడ ఓసీపీ సమీపంలోని వట్టివాగు రిజర్వాయర్ రక్షణ కట్ట నిర్మాణానికి సింగరేణి సంస్థ నిధులు(రూ.11.24కోట్ల)తో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్, ఇరిగేషన్ ఈఈ గుణవంతరావుతో కలిసి శంకుస్థాపన చేశారు.రైతులు, ప్రజల సంక్షేమం కోసం వట్టివాగు రిజర్వాయర్ రక్షణకు అన్ని చర్యలు చేపడుతామన్నారు. ఈ సందర్భంగా పలువురు మంత్రికి వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, యూనియన్ నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మంత్రికి వినతులు..

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 16 : జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రి సీతక్కకు పలువురు వినతి పత్రాలు అందజేశారు. జిల్లాలో విద్యా, వైద్య రంగాలోల అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు అనేక సందర్భాలోల వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోవడంలేదని, వెంటనే కలెక్టర్‌ను మార్చాలని మంత్రికి డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడిసెల కార్తిక్ వినతి పత్రం అందించారు. అలాగే ఆసిఫాబాద్ మండలంలోని రాజురా గ్రామాన్ని నూతన జీపీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు బొట్టుపల్లి గోపాల్, శ్రీకాంత్, రాజేందర్, నరేశ్ తదితరులు కోరారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

వేమనపల్లి, అక్టోబర్ 16 : గత జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రాణహిత ఉప్పొంగి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కోలి వేణుమాధవ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సింగిల్ విండో చైర్మన్ కుబిడె వెంకటేశం, మాజీ సర్పంచులు కొండగొర్ల బాపు, బోర్కుటి సంతోష్, సీనియర్ నాయకుడు పురాణం లక్ష్మీకాంత్, రైతులతో కలిసి తహసీల్దార్ రమేశ్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాణహిత ఉప్పొంగడంతో కల్లెంపల్లి, ముక్కిడిగూడం, జాజులపేట, సుంపుటం, వేమనపల్లి, క్యాతనపల్లి, కల్మలపేట, ముల్కలపేట, రాచర్ల గ్రామాల్లోని పత్తి పంటలు నీట మునిగిపోయాయని పేర్కొన్నారు. దీంతో సుమారు 2వేల ఎకరాల్లో రైతులు పంటలు నష్టపోయారన్నారు. అయినా ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించడంలో విఫలమైందని విమర్శించారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారన్నారు. ప్రాణహితలో పంటలు నష్టపోయిన సిర్పూర్ నియోజకవర్గంలోని బెజ్జూర్, దహెగాం మండలాల రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించిందని, కానీ వేమనపల్లి మండలంలోని రైతులకు ఇవ్వకుండా మోసం చేసిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోర్ల మొండి, సత్యం, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

నేడు కల్వరీ చర్చి ఉపవాస దీక్షల ముగింపు సభ

కాసిపేట, అక్టోబర్ 16 : సోమగూడెం, బెల్లంపల్లి రహదారి మధ్యలోని ప్రముఖ కల్వరీ చర్చి పాస్టర్ ప్రవీణ్ 50 రోజుల ఉపవాస దీక్షల ముగింపు (గురువారం సాయంత్రం) సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. యేటా పాస్టర్ ప్రవీణ్ 50 రోజులు ఉపవాస దీక్షలు చేపడుతారు. జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో క్రైస్తవులు తరలిరానుండగా, సుమారు 100 ఎకరాల్లో ఏర్పాట్లు పూర్తిచేశారు. సుమారు 2 లక్షల మంది హాజరవుతారని నిర్వాహకులు అంచనా వేసి, అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఒక రోజు ముందుగానే క్రైస్తవులు సభ వద్దకు చేరుకుంటుండగా, బెల్లంపల్లి, సోమగూడెం ప్రాంతాలు జనసంద్రమయ్యాయి. చర్చి సమీపం నుంచి సభ వరకు రహదారి పక్కన భారీగా హోటళ్లు, తినుబండరాలు, బొమ్మలు వివిధ రకాల తాత్కాలిక షాపులను ఏర్పాటు చేశారు. దీంతో పాటు రాష్ట్ర, జిల్లా ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు హాజరుకానున్నారు. రామగుండం సీపీ శ్రీనివాస్ భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించి, పలు సూచనలు చేయగా, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పవర్‌ప్లాంటును తెరిపించాలని నిరసన

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 16: మంచిర్యాలలోని రంగంపేటలో గల శాలివాహన పవర్ ప్లాంటును ప్రభుత్వం చొరవతీసుకొని తెరిపించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు బుధవారం ప్లాంటు ఎదుట నిరసన చేపట్టారు. పవర్‌ప్లాంటు కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్ మాట్లాడుతూ.. 20 నెలలుగా పవర్ పర్చేస్ అగ్రిమెంట్ ముగిసిందని కంపెనీని మూసివేశారని, దీంతో కార్మికులంతా ఉపాధి కోల్పోయారన్నారు. స్థానిక ఎమ్మెల్యేతోపాటు, జిల్లా అధికారులు పవర్ ప్లాంటు విషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని పవర్‌ప్లాంటును తెరిపించాలని కోరారు. శాలివాహన పవర్ ప్లాంటుకు పీపీఏ అనుమతులు ఇప్పిస్తే ప్లాంటు నడుస్తుందని పేర్కొన్నారు. సుమారు 300 మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. కార్మిక సంఘం నాయకులు చెట్టి శ్రీనివాస్, కాయితి శ్రీనివాస్, పెంట స త్యం, ఊడెం రవిశంకర్, ఆసరి రాజయ్య, తిరుపతి, మానెం శ్రీశైలం, తిరుపతి, పోశం తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులకు టోకరా

- **ఖాతాదారులకు తెలియకుండానే డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్న ఘనుడు**

కోటపల్లి, అక్టోబర్ 16 : కోటపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లోని నిరక్షరాస్యులైన ఖాదారులకు ఓ ఘనుడు టోకరా వేశాడు. వారి ఖాతాల నుంచి డబ్బును తన ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. బాధితుడు, కొండంపేట గ్రామానికి చెందిన గావిడి భీమయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కోటపల్లి మండలం నక్కలపల్లి గ్రామానికి చెందిన సీఎస్‌పీ నిర్వాహకుడి తమ్ముడు పుప్పిరెడ్డి సాయి రెడ్డి కోటపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వద్ద ఉంటూ బ్యాంక్‌కు వచ్చే నిరక్షరాస్యుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుంటున్నాడు. వారికి బ్యాంక్ వోచర్లు రాసిస్తూ తన ఖాతాలోకి డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటున్నాడు. ఇటీవల కొండంపేట గ్రామానికి చెందిన గావిడి భీమయ్య నుంచి రూ. 49వేలు తన ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ చేయించడంతో ఈ తతంగం వెలుగు చూసింది. ఇటీవల కోటపల్లి తెలంగాణ బ్యాంక్‌కు నగదు డ్రా కోసం వచ్చిన భీమయ్యకు సాయిరెడ్డి వోచర్ రాసి ఇస్తా అని చెప్పాడు. దీంతో పాటు, రూ.49 వేలను తన పేరిట ట్రాన్స్‌ఫర్ చేసేలా వోచర్ రాసి ఇచ్చాడు. బ్యాంక్ అధికారులు ఆ నగదు ట్రాన్స్‌ఫర్ చేశారు. విషయం బయటకు పొక్కడంతో భీమయ్య తనకు జరిగిన అన్యాయాన్ని బ్యాంక్ అధికారలతో పాటు, పోలీసులకు పిర్యాదు చేశారు. బ్యాంక్ వద్దే ఉంటూ వోచర్లు రాసి ఇచ్చిన సాయి రెడ్డి.. మండలంలోని కొండంపేట, మల్లంపేట, నక్కలపల్లితో పాటు, వేమనపల్లి మండలానికి చెందిన పలువురు ఖాతాదారుల నుంచి రూ.లక్షల్లో డబ్బులు తన ఖాతాలోకి బదిలీ చేయించుకున్నట్లు సమాచారం. ఈ విషయమై బ్యాంక్ మేనేజన్ రాజేశ్‌ను వివరణ కోరగా, తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. బాధితుడి ఫిర్యాదుతో విచారణ జరుపుతున్నామని చెప్పారు. ఇంకా ఎవరైనా మోసపోయినట్లు అనుమానం వస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు.

ట్రాన్స్‌కో బదిలీ అధికారులకు సన్మానం

చెన్నూర్ రూరల్, అక్టోబర్ 16 : చెన్నూర్ మండలంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న ట్రాన్స్‌కో అధికారులను స్థానిక సబ్‌డివిజన్ కార్యాలయంలో బుధవారం సిబ్బంది ఘనంగా సన్మానించారు. చెన్నూర్ ఏడీఈ రవికుమార్ బెల్లంపల్లికి, కొమ్మెర ఏఈ భాస్కర్ బెల్లంపల్లి టెక్నికల్ ఏఈగా బదిలీ అయ్యారు. అలాగే పలువురు లైన్‌మన్లు కూడా ఆయా గ్రామాలకు బదిలీ అయ్యారు. కొమ్మెర ఏఈగా కాశెట్టి శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించాడు. ఈ కార్యక్రమంలో ఏడీఈ రవికుమార్, ఏఈలు శ్రీనివాస్, చెన్నూర్ ఏఈ శ్రీనివాస్, భాస్కర్, లైన్‌మన్లు సతీశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి, అక్టోబర్16 : దండేపల్లి లైన్‌మన్ రామస్వామి, అసిస్టెంట్ రాజలింగు బదిలీపై వెళ్తుండగా, మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోండి

మంచిర్యాల (ఏసీసీ), అక్టోబర్ 16 : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు నమోదు చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ సూచించారు. అర్హులైన వారు తమ కార్యాలయాన్ని సంప్రదిస్తే ఓటు హక్కు నమోదు చేయిస్తామని వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని బ్యాడ్మింటన్ అకాడమీ, ఒక ప్రైవేటు పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో బింగి ప్రవీణ్, అశ్విన్, బియ్యాల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

భీం వర్ధంతి సభ విజయవంతం చేయాలి

తిర్యాణి, అక్టోబర్ 16 : కెరమెరి మండలం జోడేఘాట్ గ్రామంలో గురువారం నిర్వహించనున్న కుమ్రం భీం 84వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని తుడుం దెబ్బ మండలాధ్యక్షుడు తొడసం భాస్కర్, డివిజన్ అధ్యక్షుడు గేడం సుభాష్ కోరారు. మండల కేంద్రంలోని కుమ్రం భీం భవనంలో బుధవారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా ఆదివాసీ సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు, మేధావులు, ఇతర సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యోగ సంఘ నాయకులు కోట్నాక ప్రవీణ్ కుమార్, తుడుందెబ్బ నాయకులు కోట్నాక భారిక్‌రావు, ప్రవీణ్‌కుమార్, ఆయా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట, అక్టోబర్ 16 : జోడేఘాట్‌లో నిర్వహించే కుమ్రం భీం వర్ధంతికి మంచిర్యాల జిల్లా నుంచి భారీగా తరలివెళ్లి, విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. దేవాపూర్‌లోని కుమ్రం భీం విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు ఆడె జంగు, ఆత్రం జంగు, పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్, అక్టోబర్ 16 : భీం వర్ధంతిని ప్రతి ఆదివాసీ పల్లెల్లో ఘనంగా జరుపుకోవాలని ఆదివాసీ నాయకులు సూచించారు. మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు సిడాం సకారాం, కోర్తె తిరుపతి, సెద్దల శంకర్, పద్మ మాట్లాడారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

దండేపల్లి(జన్నారం), అక్టోబర్16 : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ప్రణాళికాబద్ధంగా చదివి, ఉత్తమ ఫలితాలు సాధించాలని వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్జేడీ) కాటేపల్లి సత్యనారాయణరెడ్డి సూచించారు. జన్నారం మండలం కలమడుగు ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. ఎన్ఎంఎంఎస్‌లో గతేడాది జిల్లాలో మొదటిస్థానంలో నిలిపినందుకు హెచ్ఎం కట్ట రాజమౌళి, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వెల్ క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని సూచించారు. ఎంఈవో విజయ్‌కుమార్, ఉపాధ్యాయులున్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

మంచిర్యాల టౌన్, అక్టోబర్ 16 : మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్‌రోడ్‌లో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ కొనసాగుతున్నది. దసరాకు ముందు కార్యక్రమాన్ని చేపట్టగా, పండుగ సమయంలో ఆక్రమణలను కూల్చవద్దని వ్యాపారులు అధికారులను కోరడంతో ఆపేశారు. తాజాగా రెండు రోజులుగా రోడ్డును ఆక్రమించుకొని చేపట్టిన కట్టడాలు, అక్రమంగా వెలిసిన దుకాణాలను తొలగిస్తున్నారు. జడ్పీ బాలికల పాఠశాల ముందు వేసిన షెడ్లను మున్సిపల్ అధికారులు తీసివేశారు. మార్కెట్‌రోడ్‌లో పలువురు వ్యాపారులు తమ వ్యాపార సముదాయాలను సెట్ బ్యాక్ లేకుండా, మరికొందరు రోడ్డుమీదకు వచ్చి కట్టడాలు నిర్మించగా, వారి భవనాలకు మార్కింగ్ ఇచ్చారు. అక్కడి వరకు ఎవరికి వారు తొలగించుకోవాలని సూచించారు. లేకపోతే తామే తొలగిస్తామని హెచ్చరించారు. దీంతో పలువురు వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగించుకుంటున్నారు. ఆక్రమణల తొలగింపు ప్రక్రియను బుధవారం మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, టీపీవో సంపత్, మున్సిపల్ అధికారులు పరిశీలించారు.

16 మందికి జీవిత ఖైదు

రెబ్